

# మనసులు చేసుకున్న పెళ్లి

శారదని చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది నాకు లేకపోతే దీనికెంత పొగరెక్కింది! ఎంత తెగించింది! నన్ను అంతలేసి మాటలు దాని జీవితంలో యెప్పుడైనా అని యెరుగునా

అది!! ఇప్పుడెలా వచ్చింది దానికీ తెగింపు?

"ఏదే! ఇంకోసారనా మాట"

గుండెలు భగ భగ మండిపోతూంటే కోపాన్నంతా కళ్లల్లో ప్రదర్శిస్తూ

అన్నాను చర్రున తలెత్తి, ధీమాగా ధైర్యంగా నా ముఖంలోకి చూస్తూ అంది

"ఒక్కసారికాదు వందసార్లు అనమన్నా అంటాను ఏం నాకేం భయవా? నువ్వేవన్నా తాళిగట్టిన భర్తవా పెట్టి పోషిస్తున్న యజమానివా? నువ్వంటే నాకసహ్యం...అసహ్యం.. అస-"

'ఇక భరించలేకపోయాను నాలో సహనం చచ్చిపోయింది ఊరెగిరేలాగ అది అలాగ అంత ధైర్యంగా, మొండిగా అవమానకరంగా యిష్టమొచ్చినట్లు అరిచేస్తుంటే...నా మగతనం చంపుకొని పడివుండటం నా తరం కాలేదు

మంచం పందిరికి జార్లబడి నిల్చున్న దాన్ని జబ్బపట్టుకుని నా దగ్గరగా లాక్కున్నాను

"ఎంత మాటన్నావే..." అంటూ పళ్లు కొరుకుతూ, రెండుచేతుల్తో బలంగా దాని రెక్కలు వెనక్కి విరిచి పట్టుకున్నాను.

తలెగరేస్తూ నా ముఖంలోకి పొగరుగా చూసింది

చుట్టూ కలియజూశాను చేతి కందుబాటులో ఏదీ కనిపించలేదు దాని రెండు రెక్కలూ ఒక చేత్తో గట్టిగా పట్టుకుని నా కోపాన్ని వెయ్యింతలు చేస్తున్న దాని ముఖాన్ని యింకో చేత్తో బలంగా నొక్కిపట్టి, మనిషి పళంగా బలంగా వెనక్కి విసిరాను

రివ్వున వెళ్ళి వుండచుట్టుకుపోయి పడింది మంచంమీద చాలా బలంగా రాక్షసుడిలా తోసెయ్యగలిగాను అనిపించింది కసితీరినట్టుగా ఫీలయి ఊపిరి పీల్చుకున్నాను కాని అంత కోపంలోనూ దానికి దెబ్బ తగిలిందేమోనని యెందుకో భయంకలిగింది

అది మాత్రం కిక్కురుమనలేదు నా పౌరుషం పదింతలయింది

'ఎంత మొండిపీనుగ ఇది! కొట్టినా కిక్కురుమనలేదు అనుకుంటూ ఒక్క వుదుటున మీద కెళ్ళాను

జుట్టుపట్టుకుని తలని పైకిఎత్తాను, ముఖం చేతులతో కప్పుకుని సన్నగా ఏడుస్తోంది శారద శారద...ఏడుస్తోంది శారద ఏడవడం నా జీవితంలో మొదటిసారి చూస్తున్నాను

అసంకల్పితంగానేవదిలేశానుజుట్టుని ఆవేశం చల్లబడుతోంది నెమ్మది నెమ్మదిగా నేనుచేసిన తప్పు గుర్తొస్తోందినాకు

ఒక ఆడదాన్ని నా జీవితంలో మొట్టమొదటిసారిగా కొట్టాను నా శారదని కొట్టాను శారద యెవరు? నేనెవర్ని? శారద నన్ను ఎందుకు ప్రేమించి తీరాలి? ప్రేమించకపోతే నేను కొట్టటమెందుకు? కొట్టడానికి నాకెవరిచ్చారీ అధికారం? ఇదివరకెప్పుడూ శారదని కొట్టలేదే! కనీసం తిట్టలేదే! కానీ శారదకూడా యిలా యెప్పుడూ ప్రవర్తించలేదే! ఈ రోజు మరెందుకింత అసహ్యం కలిగించేలాగ ప్రవర్తించింది?

అయితేమాత్రం నేను శారదని కొట్టె య్యడమే!? శారద వంటిమీద చెయ్యి చేసుకుంటానని నేను కలలోకూడా అను కోలేదు. మా యిద్దరి మధ్యా యింత రగడ జరుగుతున్నా అత్తయ్యా, మామయ్యా గదిలోపలికెందుకు రానట్టు? శారదని నేనేమీ చెయ్యననే ధైర్యమా వాళ్లకి? నా మీద అంత నమ్మకం వుందా వాళ్లకి? ఎందుకులేదు? పూజ్యులైన అత్తయ్య, మామయ్యలమీద యిలాంటి అపనమ్మకం ఎందుకు నాకు? ఇందాక నేను తోసిన తోపుకి శారద ఏ గోడకో గుద్దుకుని, దానికి ఏ ప్రమాదమైనా సంభవించివుంటే!!? కాపోయినా ఏదో చిన్నపిల్ల పొగరుగా మాట్లాడినంతలో - చిన్నపిల్లా? అది చిన్నపిల్లా!!? ఎంత మోసం! ఎంత దగా! ఎంత అన్యాయం! ...అయితే? పెళ్ళికాకముందే, ఆ వ్యక్తి మీద పూర్తి స్వాతంత్ర్యం లేకముందే వాళ్లింటికొచ్చి, వాళ్ళ యేకైక పుత్రిక గారాలపట్టి శారదని కొట్టెయ్యడమే?. మరి అదంతలా నోటికొచ్చినట్టు, నరం లేని నాలిక ఎలా తిరిగితే అలా వాగే స్తుంటే, నా గుండెల్ని పగులగొట్టి పిండి చేస్తూంటే, చూస్తూ వాజమ్మలా, దద్దమ్మలా వూరుకోవలసిందే? కనీసం అత్తయ్యా మామయ్యా అయినా లోపలి కొచ్చి దాన్ని...

ఇక బుర్ర పనిచెయ్యటంలేదు.

వెక్కుతున్న శారద ఏడుపు నా గుండెకు తగులుతోంది.

నాకు జరిగిన ఘోర అన్యాయం, నేను జరిపిన రాక్షసకృత్యం యింకె క్కడా చోటుదొరక్క నా మెదడును దొలుచుకుపోయి, అక్కడ స్థిమితంగా దెబ్బలాడుకుంటున్నాయి. వాటి ఘర్షణకి నా మెదడు వేడెక్కిపోయింది అనుకో కుండానే బయటకు వచ్చేశాను.

తిన్నగా పోయి, వాల్చిన పడకుర్చీలో పడిపోయాను కన్నార్పకుండా యెటోమాత్రం చూస్తున్నాను కంటికి అయితే యేమీ కనిపించలేదు మెదడు పనిచెయ్యకపోవడం వలన అలా ఎన్ని నిమిషాలు కూర్చున్నానో చెప్పటం నా తరంకాదు

"కాఫీ తీసుకోరా వాసూ."


అప్రయత్నంగా చూశాను, మాటలు వినిపించినవైపు.

కాఫీ గ్లాసుతో అత్తయ్యలాంటి మనిషి కాదు-అత్తయ్యే ఆమె ముఖంలోకి చూశాను ఆమె ముఖంలోని భావం-అది కోపమో, ప్రేమో, బాధో,...మరేమిటో నాకు తెలియదు

"కాఫీరా" అంది కాఫీగ్లాసు నా కళ్ళ ముందు పెడ్తూ

"అక్కడ పెట్టు అత్తయ్యా"అందా మనేది నా వుద్దేశం బహుశా అనే ఉంటాను. అత్తయ్య కాఫీ గ్లాసుని కుర్చీ ప్రక్కగా పెట్టి వంటింట్లోకి వెళ్ళి పోయింది

అత్తయ్య! నేనంటే ప్రాణమిచ్చే




అత్తయ్య, అమ్మకంటే యెక్కువగా ప్రేమించే అత్తయ్య, ఎందుకింత ముభావంగా వుంది? దాన్ని ముభావం అనే అంటారా? శారద నా కింత అన్యాయం చేసినందుకు అత్తయ్య నాకు ముఖం చూపించలేకపోతోందా? నామీద జాలి పడుతోందా? లేక శారదకి యీనాడు వయసూ, ఆలోచించుకునే శక్తీ వచ్చి, నన్ను పెళ్లాడకూడదని స్వంత నిర్ణయము తీసుకున్నందుకు ఆమెని సమర్థించి, లేని అధికారంతో వాళ్ళమ్మాయి మీద చెయ్యి చేసుకున్నందుకు నన్ను అసహ్యించుకుంటోందా? లేదు, ఈనాడు వాళ్ళ పిల్లమూలంగా నాకు జరిగిన ఘోర అన్యాయానికి అత్తయ్య చచ్చేలా సిగ్గుపడుతోంది

* * *

ఈ విషయం యీనాటిదా? గత పద్దెనిమిది సంవత్సరాల్నుంచీ అనుకుంటూ వస్తున్నదే. నాకు నాలుగేళ్ల వయస్సున్నప్పుడు చూపించింది అమ్మ అత్తయ్యని. అప్పటిదాకా నాన్నగారి వుద్యోగరీత్యా ఢిల్లీలో వుండిపోయిన కారణంగా వాళ్లని యెప్పుడూ చూడేలేదు. ఆ రోజునే అనేసింది అత్తయ్య "ఏరా అల్లుడూ" అని. "నా పేరు అల్లుడుకాదు. వాసు" అన్నాను. అత్తయ్య బోలెడు సంబరపడిపోయి, యెత్తుకుని ముద్దెట్టేసుకుంది. ఆ తరవాత మాటల్లో అమ్మా, అత్తయ్యా నాగురించీ, శారద గురించీ ఏవేవో చాల చాల మాట్లాడేసుకుంటూంటే నాకు బోరుకొట్టి, వుయ్యాల్లో పడుకున్న శారదతో ఆడుకుంటున్నాను. కాసేపటికి అమ్మా, అత్తయ్యా యెందుకో విరగపడి నవ్వుకున్నారు.

అమ్మ నన్ను పిలిచి, "ఏరా వాసూ!

అత్తయ్య నిన్నల్లుణ్ణిచేసుకుంటానంటోంది. ఆ ఎర్రతేలుని పెళ్లాడతావేవిట్రా?"
అంది, వుయ్యాలవైపు చూపిస్తూ.

అప్పటికి పెళ్లంటే ఏమిటో నాకేం తెలుసూ?

"ఓ యస్" అన్నాను.

మళ్ళీ యిద్దరూ నవ్వుకున్నారు.

నేనేదైనా జోకాను కాబోలు అనుకున్నాను.

అది మొదలు కొన్ని లక్షలసార్లు అత్తయ్య, మామయ్య, అమ్మ, నాన్న, యీ ఊళ్లో వాళ్లు, ఆ ఊళ్లో వాళ్లు, ఒకరేమిటి అంతా కూడా శారదనీ నన్నూ భార్యా భర్తలుగా జమకట్టేశారు. తోటి పిల్లలు కూడా అంతే బువ్వాలాటల్లోకూడా మా యిదర్నే భార్యాభర్తల్లా వుండమనేవారు. ఇంకా కళ్లతో ఇంటకూడదామంటే ఒప్పుకునే వారుకాదు.

హైస్కూలు చదువయ్యేవరకూ వాళ్ళింట్లోనే వుండి ఆ వూళ్లోనే చదువుతున్నాను. అత్తయ్య, మావయ్య తల్లిదండ్రులకంటే యెక్కువగా చూసేవారు నన్ను. "ఏరోయ్, అల్లుడుగాడుగారూ" అంటూ మామయ్య జోకులేస్తుండేవాడు.

ఇక శారదా, నేనూ, శరీరాలు వేరే కానీ ప్రాణాలొకటే. ప్రొద్దున్న లేచింది మొదలూ రాత్రి పడుకోబోయేవరకూ దరిదాపు ప్రతీ పనీ కలిసే చేసేవాళ్ళం. మా యిద్దరిలో ఎవరికైనా కొంచెం నలతగా వుంటే యింకొకళ్లకి నిద్రపట్టేడి కాదు అన్నం ముట్టేవాళ్లంకాదు అలాగే అహోరాత్రాలు వాళ్లకి బాగయేవరకూ దిగులుగా గడిపేవాళ్లం. ఒక్కొక్కసారి యిద్దరం కలిసి స్కూలు ఎగ్గొట్టేసి, తోటలోనూ, గోదావరి ఒడ్డున ఒకరి ఒళ్లోఒకరూపడుకుని, మావిడి పిందెలూ, రేగిపళ్ళూ, కందికాయలూ, సీమచింత కాయలూ తింటూ కూనిరాగాలు తీస్తూండే వాళ్ళం.

కొంచెం కొంచెం పెద్దవుతున్నకొద్దీ దాన్ని మాటి మాటికీ గుర్తుచేస్తూ వాళ్ల బోడి పెద్దరికాన్ని మామీద చూపించేవాళ్లు కొందరు పనిలేని పెద్దాళ్లు. క్రమేపీ సిగ్గంటే ఏవిటో శారదకి తెలిసొచ్చి, నేను కొంచెం కొంటెగా ప్రవర్తిస్తే "ఎవరైనా చూస్తారు బావా" అన్ని నన్ను నిరుత్సాహ పరుస్తూండేది.

స్కూలు ఫైనలు అయిపోయాక నాకు కాలేజీ చదువులకి మా అమ్మా నాన్నల దగ్గరకు వెళ్లిపోవలసి వచ్చింది వర్ణనాతీతమయిన బాధతో మా ఎడబాటు జరిగింది.

కాలేజీలో చేరానన్న మాటేగానీ ఒక్క ముక్క కూడా బుర్రకెక్కేది కాదు. అనునిత్యం శారద తలంపే. పుస్తకాల్నిండా శారద బొమ్మలే గీస్తూండేవాడిని. ప్రతిరోజూ వుత్తరాలు వ్రాస్తూండేవాడిని ఆమెకూడా అంతే.

"పిచ్చెక్కుతుందెమో కూడాను పడిక అని అమ్మ భయపడేది నాన్నగారు నన్ను కేకలేసేవారు వారం వారం శారదా వాళ్ల వూరు పోయి వస్తూండే వాడిని. పోనీ శారదని మా వూరు వచ్చివుండమందామంటే అత్తయ్యా మామయ్యా శారదని విడిచి ఒక్క క్షణం వుండలేరు. వేరే మార్గం లేక వారం వారం వాళ్లవూరు వెళ్లి శారదని కలుసుకుని, ఒకరోజు ఒక క్షణంలా గడిపేసి, బాధగా మా వూరు వచ్చేస్తూ వుండేవాడిని.

బి. ఎ. ఫస్టుక్లాసులో పాసయ్యాను. దానికి శారద అనునిత్యం నా మేలు కోరుతూ చేసిన పూజలే కారణం కావచ్చు. రిజల్ట్సు వచ్చిన తర్వాత "ఎమ్ ఎ చదువుతావేవిట్రా" అన్నారు నాన్నగారు. "నావల్ల కాదు నాన్నా" అని చెప్పేశాను నిర్మోహమాటంగా. "అయితే యిహ యెక్కే గుమ్మం, దిగే గుమ్మవే నన్నమాట" అన్నారు. "ఆ అవసరం లేదులెండి. పొరబాటున క్లాసొకటి వచ్చిందిగా, ఎక్కడో అక్కడ దొరక్కపోదు'' అన్నాను.

ఉద్యోగ రీత్యా నేను మద్రాసు వెళ్లవలసి వచ్చింది నాన్నగారు కూడా ట్రాన్స్ఫరు చేయించుకుని మద్రాసు వచ్చేసారు. అప్పటినుంచీ వారం వారం కూడా కలుసుకోలేక పోతున్నందుకు శారదా నేనూ కుమిలిపోయాం.

ఉత్తరాలు వ్రాసుకోవటం మాత్రం మా నిత్యకృత్యాల్లో ఒకటి అయి పోయింది. సంవత్సరం పూర్తి అవుతూనే నెల్లాళ్లు సెలవుపెట్టి శారదతో గడపాలని నిశ్చయించుకున్నాను. ఒక రోజున అమ్మతో శారదని విడిచి వుండలేకపోతున్నానని, తర్వాలో ముహూర్తం పెట్టించమని సిగ్గు విడిచి చెప్పేశాను. దానికి అమ్మ చెప్పిన జవాబు విని నా తల తిరిగిపోయింది. మంచి కట్నం ఇచ్చే సంబంధాలు అనేకం వస్తున్నాయని, శారదని మరిచిపొమ్మనీ చెప్పింది అమ్మ. నాన్నగారి అభి ప్రాయం కూడా అదేనని తెలిసి పోయింది చుట్టాలు దగ్గర కట్నం తీసు కోవటం తమ కిష్టంలేదని చెప్పారు. నేను పెళ్లంటూ చేసుకుంటే శారదనే చేసుకుంటానని ఖచ్చితంగా చెప్పేశాను.

రోజులు గడుస్తున్నకొద్దీ అమ్మా నాన్నల ప్రవర్తననిబట్టి శారదనీ నన్నూ విడదీయటానికి వాళ్లు బాగా ప్రయత్నిస్తున్నారనే అనుమానం నాకు బలవంతం కాజొచ్చింది. కొన్నిసార్లు శారదనుంచి నాకు వచ్చిన వుత్తరాలు దాచెయ్యటం, దానిమీద వాళ్లతో నాకు ఘర్షణలు జరగటం కూడా జరిగి పోయాయి.

పరస్పరం అభిమానించుకునే మను షులు దూరమవుతున్నకొద్దీ వాళ్ల మధ్య ప్రేమ పెరిగిపోతుందంటారు.

మా యిద్దరి విషయంలోనూ అదే జరిగింది. అమ్మా నాన్నా శారదని మరిచిపొమ్మని చెప్తున్నకొదీ ఆమెమీద ప్రేమ అభివృద్ధి అవసాగింది తుచ్ఛమయిన కట్నంకోసం, పుట్టి బుద్ధెరిగినప్పట్నుంచీ నన్నే నమ్ముకున్న శారదకి అన్యాయం చెయ్యనని ఖచ్చితంగా చెప్పేశాను యింట్లో. అవన్నీ సినిమాల్లోనూ, కథల్లోనూ మాటలని, వాళ్లమాట విని మంచి కట్నం వొచ్చే సంబంధం చేసుకోమని బ్రతిమాలాడారు. నా గొంతుకలో ప్రాణం వుండగా ఆ పని చెయ్యనన్నాను అయితే వాళ్ల గొంతుకలో ప్రాణం వుండగా యీ సంబంధానికి ఒప్పుకోమన్నారు వాళ్లు ఎవరి గొంతుకలో ప్రాణాలు వాళ్లకుండగానే వాళ్లనుంచి విడిపోయి వేరే మకాం పెట్టేశాను నేను ఈ వేర్పాటు సరిగ్గా నెల క్రితం జరిగింది

వెంటనే వుత్తరంలో నేను ఒక నెల రోజుల్లో వస్తున్నట్లు, స్వతంత్రించి శారదని పెళ్లిచేసుకోబోతున్నట్లు, అమ్మావాళ్లు యీ పెళ్లికి రావటంలేదనీ, వెంటనే ముహూర్తం నిర్ణయించమనీ అత్తయ్యకి వ్రాశాను 'పెళ్లికి తొందరరేం వొచ్చిందిరా వాసూ! ముందు అమ్మా వాళ్లని చల్లబరిచి, నెమ్మదిగా వాళ్లకి నచ్చచెప్పు నేను కూడా వ్రాస్తాను. వాళ్లకి యిష్టంలేకుండా యీ పెళ్లి జరగడం యేపంత బాగుంటదో తేయ్' అంటూ అత్తయ్య నాకు వుత్తరం వ్రాసింది 'నన్నన్యాయం చెయ్యకు బావా' అంటూ శారద 'అమ్మా నాన్నా ఒప్పుకోవటం కల్లో కూడా జరగదు. వెంటనే వచ్చే నెల్లో ముహూర్తం విషయం చూడండి ఎవరికి యిష్టం వున్నా లేకపోయినా శారదని పెళ్లాడి తీరతాను' అని వ్రాసాను పెద్దాళ్ళ మధ్య ఏం వుత్తర ప్రత్యుత్తరాలు జరిగాయో నాకు తెలియదు

ముహూర్తం నిర్ణయిస్తూ నాకు వుత్తరం వ్రాసింది అత్తయ్య. నన్ను నమ్ముకున్న పిల్లకి న్యాయం చేస్తున్నందుకు ఆనందం ఒకవైపు, అమ్మా నాన్నల్ని బాధ పెడుతున్నందుకు విచారం యింకోవైపు కలిగాయి నాకు ఈనాటి పరిస్థితుల్లో అమ్మా నాన్నల కోర్కె కూడా తప్పు లేదనిపించింది నాకు

బాగుండదని శుభలేఖలు కొట్టించి, పదిమందికీ పంచిపెట్టేశాను.

"సారీరా అబ్బాయ్ దగ్గర్లో అయితే వచ్చేవాళ్లం" అని చెప్పేశారు అంతా 'రాకపోతేనే మంచిదిలే' అనుకున్నాను మనసులో.

తల్లిదండ్రులూ, స్నేహితులూ, బంధువులూ అందరూ వుండగా ఏకాకిలా ఒక్కణ్ణే బయలుదేరి, గంట క్రితం దిగాను వూళ్లో బట్టలయినా మార్చుకోక ముందే చెప్పింది అత్తయ్య- "శారద



నిన్ను చేసుకోనంటోందిరా వాసూ" అని. ఎందుకో అత్తయ్య హాస్యాని కంటోందని అనిపించినప్పటికీ, ఆ విషయంలో జోకులకి నవ్వే పరిస్థితిలో నేను లేను

"నేనే పరిస్థితుల్లో వున్నానో తెలుసు కదా అత్తయ్యా. పరిహాసాలెందుకు చెప్పు" అన్నాను విరాగ్గా

"పరిహాసం కాదురా నాయినా! నీ జీవితంతో యిలా ఆటాడుకోవలసిన ఖర్మ పట్టింది మాకు ఏ జన్మలో ఏ పాపం చేసుకున్నామో నువ్వూ, మేమూ కూడా– ఈ జన్మలో యిలా..."

"ఆపు అత్తయ్యా. ఏది, శారద యెక్కడుంది?" పూడుకుపోతున్న నా గొంతుకలోంచి చీల్చుకుంటూ వచ్చింది సన్నటి స్వరం

బాధతో నోట మాటరాక శారద వున్న గదివైపు చూపించింది అత్తయ్య

గదిలోకి పరిగెత్తాను తలవంచుకుని మంచంమీద కూర్చుని వుంది శారద.

"నువ్వు తనతో నన్ను పెళ్లిచేసుకోనన్నావంటోంది అత్తయ్య. అది అబద్ధం కదూ!" అన్నాను భయంతోనూ బాధతోనూ గొంతు పెగలక అతి కష్టంగా వికృతంగా వచ్చిన స్వరంతో నా కాళ్లు వణుకుతూంటే ఆమె ప్రక్కనే మంచంమీద కూలబడ్డాను

"లేదు. అమ్మ చెప్పింది నిజమే! నిజంగానే నేను నిన్ను పెళ్లిచేసుకో దలుచుకో..."

"ఆపు"

ఎలా అరిచానో తెలియదు గానీ అది మాత్రం అరుపే. కాదు- గావుకేక. కళ్లముందు కన్నకొడుకు తప్పతాగ బోతే కన్న తల్లి అరిచే అరుపులాంటి అరుపు. పిచ్చివాడిలా శారదవైపు చూస్తూ. తలబిరికేసుకుని, రెండు చేతుల్తోనూ ముఖం కప్పుకుని, ఆడదాన్లా భోరున ఏడ్చేశాను. శారద మౌనంగానే వుంది. అలాగే తలప్రేల్లా దేసుకుని యింకొకవైపు తిరిగి కూర్చుంది.

ఏడ్చి, ఏడ్చి కొంచెం భారం తీరి వూరట కలిగింది నాకు. నెమ్మదిగా మొండితనం, మొగతనం తలెత్తింది. నెమ్మదిగా బాధ స్థానే కోపం చోటు చేసుకోసాగింది నా హృదయంలో

"శారదా! నా ముఖంలోకి చూసి చెప్పు. ఎందుకీ నిర్ణయం తీసుకున్నావు నువ్వు?"

"........."

"పోనీ వేరే యెవర్నయినా ప్రేమించావా?"

"........."

"శారదా! ప్లీజ్ మాట్లాడు ప్రేమించకపోయినా వేరే యెవర్నయినా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నావా?"

'అవున' న్నట్లు తలూపింది శారద.

దెబ్బతిన్నాను. 'ఎవరతన'ని అడుగుదామనుకున్నాను. కాని అనవసరమనిపించింది

"ఎందువల్ల యింకొకర్ని పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్నావు? మా అమ్మా, నాన్నా మన పెళ్లికి యిష్టపడలేదనా?" ఖంగుమంది నా గొంతు.

'అవున న్నట్లు తలూపింది మళ్లీ.

"ఇది చాలా సిల్లీగావుంది శారదా! పెళ్లాడేవాడ్ని నేను గాని, వాళ్లు కాదు గదా! నేను నీకేం ద్రోహం చేయటం లేదే! నన్ను కని, పెంచి, నా మీద యెన్నో ఆశలు పెట్టుకున్న తల్లి దండ్రుల్నే నీకోసం దూరంచేసుకున్నానే! ఇలా అర్థాంతరంగా నన్న న్యాయం చేస్తావా శారదా!! ఇది నీకు న్యాయంగా వుందా?"

"........."

"మాట్లాడూ" వురిమాను

శారదనీ, ఆమె ఆచరిస్తున్న

మౌనాన్ని చూస్తూంటే కోపం కట్టలు తెంచుకుంటోంది నాలో

"ఏం మాట్లాడనూ ?— ఇది నా స్వవిషయం !"

తెల్లబోయాను

"ఏది స్వవిషయం ??"

"జీవితంలో భా'స్వామి కోరుకోవడ మనేది" అంది నెమ్మదిగా

"ఛీ ! చిన్నప్పట్నుంచీ "బావా ! నువ్వే నా దైవం, జీవితంలో పెళ్లాడితే నిన్నే పెళ్లాడుతా" నంటూ నా చుట్టూ తిరిగి, నన్ను నమ్మించి ; యీ రోజు అందర్నీ కాదని నిన్నో దేవతలా భావించి వచ్చినందుకు నన్ను నువ్వు యింత చులకన చేస్తావా ? మరి యీ విషయం వుత్తరంలో యెందుకు వ్రాయలేదు నాకు ?"

"........."

"మాట్లాడవేం రాక్షసీ"

నేను అరచిన అరుపుకి లంకంత యిల్లూ మారుమ్రోగింది.

"ఏం మాట్లాడనూ ?" చిరాగ్గా అంటూ లేచి నిల్చుంది

"నన్నెందుకిలా మోసంచేసావు ?" నేనూ నిలబడుతూ కోపంగా అన్నాను.

"నేనేం మోసంచేసాను ?" అంది నంగనాచిలా

"ఏం మోసంచేసావా ? చిన్నప్పట్నుంచీ నేనంటే నీ కిష్టమున్నట్లు ఎందుకు నటించావు ?"

"నేనేం నటించలేదు నువ్వే నన్ను నీ వెనక తిరిగేలా చేసుకున్నావు. చిన్నతనంలో చేసిన తప్పుకి యిప్పుడు బాధ పడుతున్నాను.''

"చిన్నతనంలో చేసిన తప్పా ?? నాలుగు రోజుల క్రితం వరకూ తాళికట్టిన భార్యకంటె యెక్కువగా వుత్తరాలు వ్రాసినదానివి, యింతలోనే చిన్నతనం పోయి పెద్దదానివయి పోయావా?"

"అనవసరం. నువ్వింక నాతో మాట్లాడొద్దు" దూరంగా పోయింది.

''ఏం ? ఎందుకని ?" మొండిగా దగ్గరగా వెళ్లాను

"నువ్వంటేనే నాకసహ్యం" గబుక్కున అనేసింది.

మళ్లీ తెల్లబోయాను.

సభకి ముఖ్య అతిథిగా పిలిచి బట్టలు విప్పి నగ్నంగా వేదికమీద నిలబెట్టి నట్లయింది నాకు.

కాదని చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది నాకు...

.......

"మరేం బాధపడకురా అబ్బాయ్. దానికేం రోగం వచ్చిందో యీ పాడు బుద్ధి పుట్టింది మేమెంత నచ్చచెప్పినా వినటంలేదు. నీకేం రాజాలాంటి కుర్రాడివి బంగారంలాంటి సంబంధం దొరుకు..." యేదో చెప్తున్నాడు మామయ్య మంచంమీద లేచి కూర్చుంటూ

"అనవసరం మావయ్యా దయచేసి నన్నెవరూ పలకరించకండి" అంటూ పడక్కుర్చీలోంచి నెమ్మదిగా లేచి, శారద గదిలోకి వెళ్లాను

తలగడాలో ముఖం దాచుకుని, పరుపుమీద అపసవ్యంగా శోషకొట్టినట్లు పడివుంది శారద

ఆమె దగ్గరగా వెళ్లాను మంచానికి రెండు అడుగుల దూరంలో నిలబడ్డాను

"శారదా! నన్ను క్షమించు నీ మనసు బాధపెట్టాను మన పెళ్లి కేవలం నా యిష్టంమీదే జరిగితే అది అన్యాయం నీ మనసు తెలిసీ నిన్ను బలవంతంగా పెళ్లాడ బూనుకుంటే అది మూర్ఖత్వం మన యిద్దరికీ వున్న సంబంధం కారణంగా నువ్వు నీ యిష్టమయిన వాణ్ణి పెళ్లాడ్డం విషయంలో ఏమైనా అడ్డంకులొస్తే ఆ పాపం నాదే నేను నీకంటే పెద్దవాడిని చిన్నప్పుడే నేను నీకు అన్యాయం చేసాను నీ మీద నేను మమకారం పెంచుకోవటంతో సరి పెట్టుకోక, నువ్వు కూడా నన్ను ప్రేమించేలాగ చేసుకున్నాను ఇది కేవలం నా స్వార్థం నీ వ్యక్తిత్వాన్ని యీనాటికి గుర్తించుకున్నావు చేతులు కాలక ముందే జాగర్తపడ్డావు భగవంతుడు నీకు అనుగ్రహం అందగావుండి, సకల ఐశ్వర్యాలూ, ఆయురారోగ్యాలూ నివ్వాలని, సకల సంపదలూ వున్న వ్యక్తినీకు భర్తగా లభించి పిల్లాపాపలతో నీ సంసారం కళకళలాడాలని మనసారా కోరుకుంటున్నాను ఇక నీ జీవితంలోకి యెప్పటికీ రానని భగవంతుడిమీద ప్రమాణం చేస్తున్నాను నన్ను దయ చేసి క్షమించు"

ఇప్పుడు నా మనసు యెంతో తేలిక పడింది మెదడులో యెటువంటి ఆలోచనాలేదు హాయిగావుంది హుషారుగా బయటకు నడిచాను గాలిలో తేలుతున్నట్లుగా వుంది


"ఎక్కడికిరా వాసూ? వేణ్ణీళ్లు పెట్టించాను బట్టలు మార్చుకో స్నానం చేసి కొంచెం యెంగిలిపడి వెళ్దువుగాని బయటకు అసలూ తలకాయల్లేవ్రా యింట్లో యెవ్వళ్లకీ వాడు పాపం కనీసం బట్టలైనా మార్చుకోకుండానే దిక్కుమాలిన భాగోతం పెట్టారు ఒరేయ్ వాసూ ఆగరా" అరుస్తున్నాడు మామయ్య వెనకనుంచి

కనీసం వెనక్కైనా తిరక్కుండా నడకసాగించాను

..... .

నా బాధను చూడలేక కాబోలు దినకరుడు పశ్చిమకొండల చాటున ముఖం దాచుకుంటున్నాడు లొల్లాయి పదం పాడుతూ ఏకాకిలా నెమ్మదిగా పడవ నడుపుతున్నాడు ఒక పల్లెవాడు

జీవితంలో దగా పడ్డందుకు బాధపడాలో, భవబంధాలు తెంపుకుని స్వతంత్ర జీవినయినందుకు సంతో




షించాలో తెలియక, శూన్యంలోకి చూస్తూ మెట్టుమీద కూర్చుని వున్నాను నేను చాలాసేపే అయింది నేను అక్కడ చేరి ఆ ప్రశాంత వాతావరణంలో మనసు కొంత తేలికపడింది జరిగిన పంచిచెడుఁమీద ఘర్షణ తగ్గించి, పల్లెవాడు పాడుతున్న పాట వింటూ, ఆకాశంలోని అరుణ కాంతిని ఆస్వాదిస్తున్నాను

'బావా !"

ఉలిక్కిపడ్డాను ఏమిటీ భ్రమ ?! మళ్లీ మనసు యెందుకిలా చంచలమవుతోంది ? జరిగిన సన్మానం చాలదా ?!

"బావా !"

నూతిలోనుంచి వచ్చినట్లున్న ధ్వని

కంగారుగా ప్రక్కకి చూశాను

శారద !

శారదా ?

అవును శారదే ! చేతిలో నా పెట్టి

అయోమయంగా చూస్తూ పైకి లేచాను

పెట్టి క్రింద పెడ్తూ నా కాళ్లమీద పడిపోయింది శారద నాకేమీ అర్థం కావటంలేదు ఏమిటీ వింత సంఘటన?!

"నన్ను క్షమించు బావా ! నీకు ఘోరమైన అన్యాయం తలపెట్టాను " వణుకుతున్న హీనస్వరంతో అంటూ, నా కాళ్లను చుట్టేసుకుంది శారద

"శారదా ! లే ఎవరి ఖర్మకు వాళ్లు కర్తలు ఏ జన్మలో ఏం పాపం చేసుకున్నానో యీ జన్మలో యిలా అందరికీ దూరమయ్యాను దీనికి యెవరూ బాధ్యులుకారు లే! లేచి యింటికి వెళ్లు ''

ఆమెను ముట్టుకోవాలంటేనే నాకెందుకో భయంగావుంది కాళ్లు వెనక్కి లాక్కోవడానికి ప్రయత్నించాను

ఆమె నాకాళ్లు వదల్లేదు ఆమె అశ్రు ధారల్తో నా పాదాలు తడిసిపోతున్నాయి

"బావా! నువ్వు నన్ను క్షమించా ననేదాకా నీ పాదాలు వదల్ను నేను నన్ను పెళ్లిచేసుకోమని కోరటంలేదు నేను ఆ అర్హతని పోగొట్టుకున్నాను కనీసం నిన్ను బ్రతిమలాడే అధికారం కూడా నాకు లేదు నా అంత పాపి యిప్పటి వరకూ యీ భూమ్మీద పుట్ట లేదు. పుట్టబోదు పుట్టకూడదు. నేను నిన్ను అర్థించేది, పాకులాడి ప్రార్థించేది ఒక్కటే- నన్ను క్షమించగలనని ఒక్కమాట అను చాలు. తర్వాత నా దారి నేను చూసుకుంటాను"

బ్రాన్పడిపోయాను ఏమిటీ వింత ప్రవర్తన ?!! శారదకి మతిచెడిందా ? నాలుగు రోజుల క్రితంవరకూ నన్ను ఆరాధ్య దైవంగా కొలిచింది సంవ త్సరం నుంచీ ఆమెని కలల్లోనే కలుసు కుంటూ, యీనాడు యెంతో ఆత్రుతతో తన యింటి కొచ్చిన నన్ను అసహ్యించు కుంది మళ్లీ ఒక్క రెండు గంటల్లోనే మనసు మార్చుకుని తన తప్పు తెలుసు కుని నా కాళ్లమీద పడి, క్షమించమని ప్రాధేయపడుతోంది పరిస్థితి నా కేమీ బోధపడటంలేదు క్రిందకు చూసాను కుప్పలా నాకాళ్లమీద కూలిపోయివుంది శారద కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తోంది

అసంకల్పితంగానే శారదని నెమ్మదిగా లేవనెత్తాను

కన్నెత్తి నన్ను చూడలేకపోతోంది శారద సిగ్గుతో చచ్చిపోతోంది కళ్లు జలపాతాలులాగ వున్నాయి

"నిన్ను మనస్ఫూర్తిగా క్షమి స్తున్నాను శారదా'' అనగలిగాను. అంతే!

నా చేతుల్లోంచి విడిపోయింది నాకు దూరంగా వెళ్ళిపోసాగింది

''చాలు బావా చాలు! నాకిప్పుడు యెంతో హాయిగావుంది నీ బ్యాగ్ అదిగో వెంటనే మద్రాసు వెళ్లిపో. మా యింటికి మాత్రం వెళ్లొద్దు ఆ పాప కూపంనుంచి దూరంగా పో త్వరగా దేవుడు నీకు మేలు చెయ్యాలని కోరు కుంటున్నాను శలవు" అంటూ గోదావరి వైపు పరుగుపెట్టసాగింది

ఈ హఠాత్పరిణామానికి అదిరి పోయాను నేను.

"ఆగు శారదా! శారదా! ప్లీజ్, శారదా! ఆగు!''

బలంకొద్దీ పరిగెట్టాను అప్పటికే నీళ్లల్లోకి వెళ్లిపోయింది ఆమె గంగమ్మ తల్లి ఆమెని తనలో కలుపుకోకముందే పట్టుకున్నాను శారదని

"నన్ను ఆపుచెయ్యొద్దు బావా! నన్నొదిలెయ్, ప్లీజ్, వదిలెయ్ నేను మహా పాపిని నన్ను చావనియ్ నా

పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోనియ్ వదిలెయ్ బావా! నన్నొదిలెయ్ ''


నా చేతుల్లోంచి విడిపించుకోడానికి విఫల ప్రయత్నం వేస్తూంది

"నీ పాపానికి ప్రాయశ్చిత్తం జరిగి పోయింది శారదా, నీ తప్పు నువ్వు తెలుసుకొని, క్షమాపణ కోరుతున్నావు అంతకు మించిన ప్రాయశ్చిత్తం ఏమీ లేదు నువ్వు నిర్దోషివి నా మాట నమ్ము బుజ్జగిస్తూ అన్నాను

''బావా అంటూ నా గుండెలమీద వాలి యింకొకసారి బావురుమంది నేను ఆమెను వారించలేదు లోపలున్న దుఃఖ మంతా బయటకుపోతే మనసు తేలిక పడుతుందని ఊరుకున్నాను ఆమె జుట్టు నిమురుతూ, నుదుటిమీద ముద్దుపెట్టు కున్నాను

దుఃఖ ఖారం తీరాక నా గుండెలకు హత్తుకుపోయింది ఆమెని నెమ్మదిగా నడిపించుకుంటూ ఒడ్డుకు తీసుకవచ్చాను

ఆదరణగా అనునయిస్తూ యిసుకలో కూర్చోపెట్టాను పరీక్షగా ఆమె ముఖం లోకి చూస్తూ పాత సంఘటనలు జ్ఞప్తికి తెచ్చుకొంటున్నాను అయిదు నిమి షాలవరకూ ఏమీ మాట్లాడలేదు శారద తల దించుకునే కూర్చుంది ఆమె భుజం మీద చెయ్యివేశాను అప్యాయంగా నెమ్మదిగా తలయెత్తి నా కళ్ళల్లోకి చూసింది ఎంతో ప్రేమగా జాలిగొలిపే లాగ వుంది ఆమెచూపు ఏ చూపు



అయితే చిన్నప్పట్నుంచీ నేను శారద మీద మమకారం పెంచుకోటానికి మూల కారణమో — ఆ చూపు అది సంవ త్సరం తర్వాత చూడగలుగుతున్నాను నా అసలు శారదని

''శారదా" తన్మయత్వం కలుగు తోంది నాకు ఆమె (ను) అలా చూస్తోంటే

"బావా"

ఎంతటి తియ్యని పిలుపు! హృద యాంతరాళంలోంచి వచ్చిన ఆ పిలుపు నా మనసులో మల్లెలు పూయిస్తోంది

"బావా! నిజం చెబుతాను వింటావా?"

"వద్దు! వద్దు శారదా! జరిగింది పీడ కలలా మరచిపో ఇక ముందు మాత్రం ఏ శక్తి మనల్ని విడదీయ కూడదనీ ఆ భగవంతుడ్ని ప్రార్థిద్దాం"

"కాదు బావా! జరిగింది నువ్వు తెలుసుకోవాలి! నేను వున్మాదిననుకుంటున్నావు కదూ ఈ రోజు నా ప్రవర్తన చూసి?! ఉన్మాదిని కాకపోయినా ఆడదాన్ని అందువల్లే అలా ప్రవర్తించాను"

కొంగుతో శుభ్రంగా ముఖమంతా తుడుచుకుంది

నెమ్మదిగా చెప్పటం మొదలుపెట్టింది

"నెల క్రితం నీ వుత్తరంలో మామయ్యా, అత్తయ్యా మన పెళ్ళికి ఒప్పుకోవటం లేదనీ వాళ్ళనుంచి వేరయి పోతున్నావనీ, మన పెళ్ళికి ముహూర్తం పెట్టించమనీ వ్రాసావు అప్పటిదాకా మన పెళ్ళికి యెటువంటి అవాంతరాలులేవు నువ్వు మీ వాళ్ళ నుంచి విడిపోయి నన్ను పెళ్ళాడ్డం మా అమ్మా, నాన్న లిద్దరికీ యిష్టంలేదు అందుకనే తొందరపడవద్దని అమ్మ నీకు వ్రాసింది చిన్నప్పట్నుంచీ అనుకుంటున్న సంబంధమేకదా అని, మనిద్దరినీ విడదీయొద్దనీ అత్తయ్యకి అమ్మ ఎంతో యిదిగా వుత్తరం వ్రాసింది ఆ వుత్తరానికి గానీ ఆ తర్వాత అమ్మ వ్రాసిన రెండు వుత్తరాలకుగానీ అత్తయ్య అసలు జవాబే ఇవ్వలేదు దాంతో నాన్నకి బాగా కోపమొచ్చి చస్తే ఈ సంబంధం చేసుకోవడానికి వీల్లేదన్నారు కానీ నా బాధ చూడలేక అమ్మ ఎలాగో నాన్నగార్ని ఒప్పించి, ముహూర్తం పెట్టించి నీకు వుత్తరం వ్రాసింది

ఈ సమయంలోనే, నాలుగయిదు రోజుల క్రితం నా పాలిటి శనిగాడిలా ప్రక్కింటి లాయరుగారి తమ్ముడు యీ వూళ్ళో దిగాడు వాడొక డాక్టరు మొదటి భార్య నెల క్రితమే పోయింది పిల్లలులేరుకానీ వాడికి వాడ్ని కప్పెట్టేంత ఆస్తి వుంది నన్ను వాడికి కట్నం లేకుండా చేసుకుంటామని నాన్నతో అన్నాడు లాయరుగారు ఇక నాన్న సంతోషానికి అవధుల్లేవు లక్షాధికారి ఆయనకి అల్లుడు కాబోతున్నాడంటే యింక ఆయనకి కాలు నేలమీద ఆనలేదు అతనికున్న గొప్పల్ని వెయ్యింతలు చేసి చెప్పి ఆ సంబంధం చేసుకోడానికి అమ్మచేత వొప్పించాడు నాన్న నన్నెలాగైనా వొప్పించేభారం అమ్మ మీద వేశాడు ఎలా చెప్పాలో తెలియక అమ్మ నిన్నటి వరకూ తికమక పడింది కానీ ఈ నాలుగు రోజుల్నుంచీ ప్రతి నిమిషం ఏదో మిషతో ఆ డాక్టరి అందం చదువు, డబ్బు గురించి నాదగ్గర పొగడ సాగింది విని ఊరుకోట్టడమే తప్పితే అమ్మ మనసులో వున్నదేవిటో

వూహించలేకపోయాను నిన్నపొద్దున్న నీ పోటో ఆ డాక్టరు ఫోటో ప్రక్క ప్రక్కనపెట్టి "ఇతని ముందు బావగాడు యెంత వెలవెల పోతున్నాడో చూడవే అమ్మాయ్!" అంది అమ్మ బాహ్య సౌందర్యానికి ఆ పోటోలో కన్పిస్తు న్నంతవరకూ నీమీద అతను అంద గాడేనని చెప్పవచ్చు కానీ మొదటిభార్య పోయి నెల తిరక్క ముందే పెళ్ళి పీటెక్కటానికి వువ్విళ్ళూరుతున్న ఆ ప్రబుద్ధుడి సంస్కారం-నమ్మిన వ్యక్తి కోసం సర్వం త్యాగం చేసిన నీ సంస్కా రం ముందు యెంత వెలవెల పోతుందో నేనూహించగలను ఆ మాటే అన్నాను అమ్మతో కానీ అమ్మ తన మాటల చాక చక్యంతో నన్ను మార్చెయ్య గలిగింది ఆ చాకచక్యంతోనే పెద్దయ్యాక నాకు ఎక్కడ పెళ్ళి చెయ్యలేకపోతానోనని చిన్నప్పట్నుంచీ యెంతో ఆప్యాయత కనబరుస్తూ నిన్ను తనగుప్పిట్లోంచి దాటి పోకుండా కాపాడుకొంటూ వస్తోంది అమ్మ మన చుట్టాలెవరికీ యిష్టంలేని ఈ పెళ్ళివల్ల నాకు శుభం కలగదంది బంధువులందరూ తమ యిద్దర్నీ కూడా వెలివేస్తారంది ఈ వయసులో వాళ్ళు పడరాని బాధలు పడవలసి వస్తుంది అంది నువ్విప్పుడు ఆవేశంలో నా మెళ్లో తాళి కట్టినప్పటికీ తర్వాత మీ వాళ్ళ నుంచి నువ్వు దూరమవడానికి నేనే కారణ మంటూ నన్ననేక విధాల బాధలు పెడతానంది మళ్ళీ మీ వాళ్ళతో నువ్వు ఏకమయి మీరంతా నన్నొక వంట మనిషిలాగ దాసిదానిలాగ చూస్తా రంది మీ కన్న తల్లిదండ్రుల్నుంచి నిన్ను వేరుచేశానని నన్ను మన బంధువు లంతా దుమ్మెత్తిపోస్తారంది ఊళ్లో అంతా వుమ్మేస్తారంది నీ కంటే ఆ డాక్టరు అందమైనవాడని డబ్బున్న వాడనీ, వాడ్ని చేసుకుంటే యెవరి పోరూ లేక మహారాణిలాగ దాస దాసీలతో సుఖపడతానంది మేడల్లో జీవిస్తూ కార్లలో దర్జాగా తిరగొచ్చంది ఈ మాట లన్నీ ఆడిదాన్ని కాబట్టి నా మనసుకి బాగా పట్టేశాయి నిన్ను పెళ్ళాడితే ఆమె చెప్పిన బాధలన్నీ పడాలనే భయం అతన్ని పెళ్ళాడితే ఆమె చెప్పినట్లుగా మేడల్లో జీవిస్తూ కార్లలో తిరగొచ్చనే ఆశ కలిగాయి నాలో నువ్వివాళవస్తే నేనెలా నటించాలో బాగా నూరిపోశారు అమ్మా, నాన్న నువ్వెంత బాధపడ్డా నేను కరగకూడదన్నారు ఆ ప్రకా రమే యిందాక నటించాను అప్పుడు మాత్రం నీ శారదని కాదునేను, మేడలూ కార్లూ, ఆడంబరాలూ ఆశించే అసలైన ఆడదాన్ని మాత్రమే ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించే భర్త అనురాగమే కోటి రూపాలయపెట్టు అని అర్థం చేసు కోలేని ఆ అబలని మాత్రమే అప్పుడు నువ్వు కోపంగా నన్ను తోసేసినప్పటిదాకా నీ శారదని కాదు నేను అప్పటినుంచే

ఆలోచించాను నీ కెంత ఘోర అన్యాయం నా మూలంగా జరిగి ఉండక పోతే నువ్వంత క్రూరంగా ప్రవర్తించి వుంటావనిపించింది అలా మంచంమీద పడి వుండే చిన్నప్పట్నుంచీ మన చెలిమిని గుర్తుచేసుకున్నాను ఒక్కొక్క సంఘటన నాలోని ఒక్కొక్క ఆశనీ పారద్రోలసాగింది ఇంతలో నువ్వొచ్చి అంతా నీ తప్పేనని చెప్పేసరికి నాకు బాగా కనువిప్పు కలిగి ది నీ అంత సంస్కారమున్న మనిషిని భర్తగా పొందటం కంటే భాగ్యం మరేదీలేదనిపించింది నేను చేసిన పాపం కూకటి వేళ్ళతో కడుక్కు పోయేంత వరకూ కన్నీళ్ళు కార్చాను నీ కాళ్ళమీద పడి నీ క్షమాభిక్ష పొందేవరకూ నా పాపాలకి ప్రాయశ్చిత్తం లేదనిపించింది మనశ్శాంతి కోసం తోటలోగానీ, ఇక్కడ గానీ వుంటావని వూహించాను ఇక నువ్వు ఆ మనుష్యుల మధ్య ఒక క్షణం కూడా వుండకూడదనే వుద్దేశ్యంతో నీ బ్యాగ్ కూడా "

అప్పటిదాకా యెంతో కష్టంమీద ఆమె ఆపుకుంటూ వస్తూన్న కన్నీళ్ళు వెల్లుబుకి బయటకు వస్తూంటే, నా వళ్లో వాలిపోతూ బావురుమంది ఆనందంతో నామనస్సు వురకలువేస్తూంది నామంచితనం నా అచంచలమైన మనసు నాకు న్యాయం చేకూర్చాయి ఎందుకో గర్వంగాకూడా ఫీలయ్యాను

"పిచ్చిపిల్లా! యింకా యెందుకా కన్నీళ్ళు ! మనల్ని ఏ శక్తి విడదీయలేదు ! పద ఇంకో పదినిమిషాల్లో కాకినాడకి బస్సుంది మనకి అక్కడ మన మిత్రులు అనేకమందున్నారు వాళ్ళ సమక్షంలో యీ ముహూర్తానికే నీ మెళ్లో తాళి కడతాను " అన్నాడు ఆమెను లేవదీస్తూ

నా తాకిడికే సిగ్గుపడ్తూ, నా చేయూత మీద లేచి పైట వంటినిండా కప్పుకుని తల దించుకుని ముసి ముసి నవ్వులతో హంసలా నడిచింది నా ప్రక్కనే పెళ్లి కూతురు శారద

సమయం చూసుకుని కన్నుకొట్టి, మేఘం చాటున దాక్కున్నాడు కలువ రేడు